క్లుప్తంగా

పొదుపు గ్రూపుల బలోపేతమే ధ్యేయం

బల్లికురవ: పొదుపు గ్రూపు మహిళలను లక్షాధికారులను చేయటమే ప్రభుత్వ ధ్యేయమని వెలుగు ఏపీఎం బీ. సురేంద్రబాబు తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణం అందజేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లఖ్‌పథ్ పథకంలో ప్రతి మహిళా భాగస్వామి కావాలన్నారు. గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా బ్యాలెన్స్ ఉంచుతూ తీసుకున్న రుణాలు సకాలంతో చెల్లించాలని ఏపీఎం వివరించారు.

చదువుకున్న వ్యక్తికి సమాజంలో గౌరవం


విద్యార్థులకు టైలు, ఐడీ కార్డులు అందజేస్తున్న దాత

మేదరమెట్ల: చదువుకున్న వ్యక్తికి ఉన్న గౌరవం సమాజంలో మరెవరికీ ఉండదని ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కొరిశపాడు మండలం యర్రబాలెం గ్రామంలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ఆయన టైలు, ఐడీ కార్డులను దాత మొరవనేని శైలేష్‌బాబు మంగళవారం బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదుకొని రాణించాలన్నారు. హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోపాటు దాతలు అందచేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సీహెచ్ శ్రీలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధిస్తే ప్రజలు మెచ్చుకుంటారు

చీరాల: విశాఖకు రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం కంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తే ప్రజలు మెచ్చుకుంటారని మాజీ ఎంపీ వైఎస్సార్ సీపీ నేత చిమటా సాంబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు తీర్చాలని, ప్రధాని మోదీని కలిసి రైల్వేజోన్, ఉక్కు కర్మాగారం విషయంలో మాట్లాడతానని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తే ప్రజలు హర్షిస్తారని, రాష్ట్రానికి పారిశ్రామిక రంగాన్ని తీసుకువస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు.

సినిమా థియేటర్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు


క్యాంటీన్‌లోని ఆయిల్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

చీరాల అర్బన్: పట్టణంలోని సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో అమ్మే తినుబండారాలను మంగళవారం జిల్లా ఆహార భద్రతా అధికారులు తనిఖీ చేశారు. జిల్లా ఆహార భద్రత అధికారి గరికపాటి ప్రభాకరరావు మాట్లాడుతూ పట్టణంలోని సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో అమ్మే తినుబండారాలు నాసిరకంగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు రావడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. సురేష్ మహల్, మోహన్ థియేటర్‌లోని క్యాంటీన్‌లు తనిఖీ చేసి నోటీసులు ఇచ్చామన్నారు. క్యాంటీన్‌లోని ఫ్రెంచ్ ఫ్రైస్ తయారు చేసే ఆయిల్‌ను టీపీఈ మీటర్ ద్వారా తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. థియేటర్ యజమానులకు తెలియపరిచామన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పరిశుభ్రత పాటించి ప్రేక్షకులకు డ్రింకింగ్ వాటర్ అందించాలన్నారు. ఆయన వెంట చీరాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్‌లు పాల్గొన్నారు.

వార్డు సెక్రటరీలతో ఎమ్మెల్యే సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సెక్రటరీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉందని, వాటిని అరికట్టేందుకు వర్షపునీరు పారుదల ఉండేలా చూడాలన్నారు. అలానే తాగునీరు కాలుష్యం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలానే వార్డుల్లో శానిటైజేషన్ ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకుంటూ సిబ్బందికి సూచనలు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, వార్డు కౌన్సిలర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. రోగాలు రావా మరి !

- నిధులు ఖర్చు చెయ్యొద్దంటూ హైకోర్టు ఉత్తర్వులతో నిలిచిన పనులు
- టీడీపీ సానుభూతి సర్పంచ్‌ల కుమ్ములాటలు
- సీజనల్ జ్వరాలు, వ్యాధులతో ప్రజల బెంబేలు
- కొణిదెనలో కనిపించని పారిశుద్ధ్యం


కొణిదెనలో వ్యర్థాల కుప్పలు


కొణిదెనలో సైడు కాల్వలో కదలని మురుగు

బల్లికురవ: సీజనల్ వ్యాధులు ఒక పక్క నాట్యం చేస్తున్నాయని పత్రికల్లో.. సామాజిక మాధ్యమాల్లో కోడై కూస్తుంటే ఆ పంచాయతీ అధికారులకు మాత్రం పట్టనట్లుగా కనబడుతోంది. దీనికి తోడు తెలుగుదేశం పార్టీ సానుభూతి సర్పంచ్‌ల కుమ్ములాటతో పంచాయతీ నిధులు ఖర్చుచేయలేక కోర్టుకెళ్లి అడ్డుకున్నారు. మండలంలోని కొణిదెన గ్రామ పంచాయతీ నిధులు ఖర్చు చెయ్యవద్దంటూ హైకోర్టు స్టే ఉత్తర్వులతో 3 నెలలుగా అపరిశుభ్రత, వీధిలైట్లు వెలగక, దోమల దాడితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీకి గ్రానైట్ ఎగుమతులో చెల్లించే రాయల్టీ, సీనరేజ్ నిధులు ప్రతి ఏడాది రూ. 22 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు జమవుతాయి. ఈనిధులతో గ్రామంతో పాటు శివారుగ్రామమైన గంగపాలెంలో పలు అభివృద్ధి పనులు, వీధిలైట్లు, పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

కోర్టుకెక్కిన మూడు పంచాయతీల సర్పంచ్‌లు..

కొణిదెన రెవెన్యూలో సర్వే నంబర్ 103లో ఈర్లకొండ ఉంది. ఈర్లకొండ నుంచి గ్రానైట్ మీటరు, ముడిరాళ్లు నిత్యం ఎగుమతి చేస్తారు. ఎగుమతుల్లో పెంచే రాయల్టీ ద్వారా గ్రామ పంచాయతీకి కోటి వరకు ఆదాయం సమకూరుతుంది. ఈరెవెన్యూలో నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, కే. రాజుపాలెం, గ్రామ పంచాయతీలు చేరి ఉన్నారు. 16 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య గ్రానైట్ ఆదాయం మిగిలిన పంచాయతీలకు చెందాలని అప్పటి ఒంగోలు జిల్లా పంచాయతీ అధికారికి విజ్ఞాపనతో సర్పంచ్‌ల ద్వారా తీర్మానాలతో లేఖలు ఇప్పించారు. కొణిదెనకు 22 శాతం, కే రాజుపాలెం 18 శాతం మల్లాయపాలేనికి 32 శాతం, నక్కబొక్కలపాడుకు 28 శాతం చెందేలా చేశారు.

జిల్లాల విభజనతో మార్పు..

ప్రకాశం జిల్లా నుంచి బల్లికురవ మండలం బాపట్ల జిల్లాలో చేర్చటంతో ఇక్కడి పంచాయతీ అధికారులు రెవెన్యూ గ్రామమైన కొణిదెన కే సీజరేజ్ సొమ్ము జమ చేశారు.

తమకు దక్కకకుండా కొణిదెన గ్రామ టీడీపీ సానుభూతిపరుడు పంచాయతీ సర్పంచ్ కాపులూరి లేపాక్షి విష్ణు అలా మార్చుకున్నారంటూ మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు, కే రాజుపాలెం సర్పంచ్‌లు జే రాఘవరావు, డీ రామయ్య, ఎ. లక్ష్మీ, కోర్టు కెక్కటంతో నిధులు ఖర్చు చేయకుండా స్టే విధించారు. దీనితో గ్రామ పంచాయతీలు నిధులున్నా ఖర్చు చేసే పరిస్థితి లేదు. పంచాయతీలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్, స్వీపర్లకు జీతాలిచ్చే పరిస్థితి లేదు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..

కొణిదెన గ్రామం, ఎస్సీ, బీసీ కాలనీలు ఆ పంచాయతీలోని గంగపాలెం గ్రామం, ఎస్సీ కాలనీల్లో పారిశుద్ధ్యం మూడు నెలలుగా పడకేసింది. సైడు కాల్వల్లో మురుగు నిల్వలు గ్రామంలో వ్యర్థాల కుప్పలతో దోమల విజృంభణ అధికమైంది. సీజనల్ జ్వరాలు, వాధులు ప్రబలటంతో రెండు గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ పరిస్థితులకు తోడు వీధిలైట్లు వెలగటంలేదు. గ్రామం పక్కనే ఉన్న 532 కొండ నుంచి గ్రానైట్ మీటరు, ముడిరాళ్లు తీస్తున్నారు. ఆదాయం దక్కటం లేదని సర్పంచ్ సాక్షికి వివరించారు.

స్టే రద్దుతో పనులు చేసే అవకాశం కల్పించాలి..



కొణిదెన పంచాయతీలో సుమారు 5 వేల పైచిలుకు జనాభాతో రోజు వారీ పనులు చేసుకునే కార్మికులు అధికంగా ఉన్నారు. హైకోర్టు స్టేతో పంచాయతీలో పనులు చేసే అవకాశం లేదనందున గ్రామంలో సీజనల్ జ్వరాలు, వ్యాధులు విజృంభిస్తున్నాయి.

– తన్నీరు బ్రహ్మయ్య

దోమల దాడి అధికమైంది..



గ్రామం ఎస్సీ, బీసీ కాలనీల్లో వ్యర్థాల కుప్పలు, మురుగు నిల్వలతో దోమల దాడి అధికమైంది. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేయడంతో కంటి మీద కునుకు పట్టడం లేదు. ఈ పరిస్థితులకు తోడు వీధిలైట్లు అరకొరగానే వెలుగుతున్నాయి. స్టే రద్దుతో అభివృద్ధికి పారిశుద్ధ్య నిర్మూలనకు అధికారులు తోడ్పాటు నివ్వాలన్నారు.

– కుంచపు ఏడుకొండలు

కోర్టుకెక్కడం సమంజసం కాదు..



కొణిదెనకు చెందాల్సిన గ్రానైట్ సీజనల్ ఆదాయాన్ని తమకు తగ్గించి నాలుగు పంచాయతీలకు విభజించారు. జిల్లాల విభజనలో తమకే దక్కేట్లుగా బాపట్ల జిల్లా పంచాయతీ అధికారులు చేశారు. ఏమీ చెయ్యకపోయినా మూడు పంచాయతీల సర్పంచ్‌లు కోర్టుకెక్కడంతో మూడు నెలలుగా పంచాయతీలో దోమల దాడితో సీజనల్ జ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్నాయి.

– కాపులూరి లేపాక్షి విష్ణు, సర్పంచ్

ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు


అద్దంకిలో మాట్లాడుతున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు

చీరాల రూరల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన న్యాయ చట్టాలను గురించి ప్రజలు తెలుసుకోవాలని చీరాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అన్నారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ముంతావారి సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ముఖ్య అతిథిగా రమేష్‌బాబు పాల్గొని కొత్త న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలను గురించి ప్రజలు కూలంకషంగా తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వాహనదారుల అతివేగపు డ్రైవింగ్‌ను తీవ్రమైన నేరాలుగా అభివర్ణించినట్లు చెప్పారు. ఇకనుంచి వాహనదారులు విధిగా హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేసినట్లు చెప్పారు. వాహనదారులు ఎవరైనా హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాల ప్రకారం కఠిన శిక్షలకు, విధించే జరిమానాలకు గురవుతారని చెప్పారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, చిన్న పిల్లలు వాహనాలు నడపరాదని చెప్పారు. అన్ని రకాల వాహనదారులు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలని, దాని వలన యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు.

ముఖ్యంగా యువత కొత్త చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సదస్సులో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జీకే ఈశ్వరి రెడ్డి, న్యాయవాది సీహెచ్ రామారావు, ట్రాఫిక్ ఏఎస్సై సీహెచ్ శ్రీనివాసరావు, పీఎల్వీ ఎస్డీ మతిన్, కోర్టు సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం లా దినోత్సవం సందర్భంగా స్థానిక కేఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లాయర్ షేక్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ చట్టాల గురించి అవగాహన ఉంటే విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలుగుతారన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి, మార్టూరు అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మద్దుమాల కోటేశ్వరరావు, మార్టూరు సెక్రటరీ సాంబశివరావు, అద్దంకి లెవీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ఎం. హనుమంతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత


నాయకులను సన్మానిస్తున్న ఐక్య వేదిక సభ్యులు

అద్దంకి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికా ప్రాధాన్యత ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులను మంగళవారం ఘనంగా సన్మానించారు. దానిలో భాగంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్ ప్రధాన కార్యదర్శి రావూరి అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి కలవకూరి చెంచయ్యలను ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ అటు ఉద్యోగంలో ఇటు సంఘ బాధ్యతల్లోనూ చురుకుగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ట్రెజరర్ నాగేశ్వరావు, కార్యదర్శి శ్రీను, సభ్యులు సయ్యద్ హుస్సేన్ సాహెబ్, ఐఈఆర్‌టీ కొంగల శ్రీనివాస్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ తెలగతోటి శిరీష, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి

అద్దంకి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అద్దంకి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు, కోర్టు సిబ్బందికి మంగళవారం ఆమె ద్విచక్ర వాహనదారులు, హెల్మెట్ ధరించకపోవడం వలన జరిగే ప్రమాదాలుపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు జరిగిన మయంలో ఎక్కువగా తలకు దెబ్బ తగలడం మూలానే మృతి చెందుతున్నారని చెప్పారు. తలకు హెల్మెట్ వాడటం వలన ప్రమాదాలు జరిగి కిందపడిన సమయంలో తలకు దెబ్బ తగలకుండా రక్షణగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, శ్రీమతి ఓ. శ్రీ సీత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ప్రియదర్శిని నూతక్కి పాల్గొన్నారు. 18న ఉదయం 9.15 గంటలకు కోర్టు భవనాల సమదాయం నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం పై 'అవగాహన ర్యాలీ'నిర్వహిస్తారని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొనాల్సిందిగా కోరారు.

విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలు అవసరం


మాట్లాడుతున్న హెచ్‌ఎం రామారావు

వేటపాలెం: విద్యార్థులు చదువుకొనే దశ నుంచి వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హెచ్‌ఎం పీవీ రామారావు సూచించారు. రైల్వేస్టేషన్ రోడ్డు లోగల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ యూత్ స్కిల్స్ డే సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల నైపుణ్యాలపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ఇంట్లో ఎటువంటి పనిచేసుకోవాలన్నా ఇతరులపై అధార పడకుండా వివిధ రాకాల నైపుణ్యాలను నేర్చుకొని ఉండాలని తెలిపారు. అనంతరం వివిధ రకాల నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో పీ వెంకటేష్, జానమ్మ, జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం కోసం బుధవారం ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, నాగులపాడు రోడ్, 12వ వార్డు, నాలుగో వార్డులో ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

తల్లి ఆరోగ్యమే బిడ్డకు రక్ష


పౌష్టికాహారం అందుకుంటున్న గర్భిణులు

అద్దంకి: తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడని యూపీహెచ్‌సీ వైద్యాధికారి గొట్టిపాటి జయసింహ అన్నారు. స్థానిక గాజులపాలెంలోని యూపీహెచ్‌సీలో రోటరీ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డలు బలిష్టంగా పుడతారని చెప్పారు. ప్రతి గర్భిణి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం రోటరీ ఆధ్వర్యంలో మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో 40 మందికి పౌష్టికాహారం ఉచితంగా అందజేశారు. రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చందూరి మురళీ సుధాకర్‌రావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహ్మద్ రఫీ, పూర్వఅధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పూర్వ ఏజీ అద్దంకి లెవీ ప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి, డాక్టర్ ఉబ్బా దేవపాలన, పువ్వాడ రామకోటేశ్వరరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, టీ బాబూరావు, నాగయ్య, రోటరీ స్త్రీ సంక్షేమ డైరక్టర్ కొల్లా భువనేశ్వరి రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య

చీరాల రూరల్: న్యాయవాదులపై దాడులు చేయడం ప్రతి ఒక్కరికి పరిపాటిగా మారిందని.. నిత్యం ఏదోఒక ప్రాంతంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో ముగ్గురు న్యాయవాదులపై జరిగిన దాడులకు నిరసనగా జిల్లా కోర్టు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, సెక్రటరీ కొటిక ఉదయ భాస్కర్‌లు మాట్లాడారు. కక్షిదారులకు నిత్యం న్యాయ సహాయాన్నందించే న్యాయవాదులపై ఈ మధ్య కాలంలో అకారణంగా దాడులు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని మాత్రం అమలు చేయడంలేదని వారు విచారం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయవాదులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని త్వరగా అమలుచేసి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ వైరు చోరీపై ఫిర్యాదు

మార్టూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను చోరీ చేసిన ఘటన మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. ఇసుక దర్శి గ్రామంలోని వ్యవసాయ భూముల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్‌ను నిలిపేసి మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న ఏఈ ఎస్ శ్రీనివాసరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. చోరీకి గురైన రాగి తీగ విలువ రూ.27 వేలు ఉంటుందని, స్టేషన్‌లో ఏఈ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



అలంకరించిన పీర్లు

మార్టూరు: గ్రామంలోని గన్నవరం రోడ్డులో ఉన్న స్థానిక పీర్ల చావిడిలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రం పండుగ పురస్కరించుకొని ప్రత్యేక పీర్ల ప్రార్థన చేస్తున్నారు. అలాగే గ్రామంలో పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాజీ షేక్ సుభాని, లైటింగ్ సైదా, లైటింగ్ కలాం, ముస్లిం పెద్దలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

సంపద కేంద్రాలకు స్థలాల కేటాయింపు

బల్లికురవ: గ్రామాల్లో చెత్తనుంచి సంపద కేంద్రాలకు రెవెన్యూ అధికారులు స్థలాలు కేటాయించాలని ఎంపీడీవో వై హనుమారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. 21 పంచాయతీల్లోని, 14 పంచాయతీల్లో మాత్రమే చెత్తనుంచి సంపద కేంద్రాల ద్వారా వర్మీకంపోస్టు తయారవుతుందన్నారు. కొణిదెన మల్లాయపాలెంలో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయని బల్లికురవ, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, కూకట్లపల్లిలో స్థలాలు సేకరించాల్సి ఉందన్నారు. స్థల సేకరణ జరిగితే నిర్మాణ పనులు చేపట్టవచ్చన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి కొలుపులు


అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను మంగళవారం ఉదయం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు నిర్వహించారు. ఉదయం దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రికి గ్రామంలోని మాస్కో బజారుకు చెందిన రైతన్నల బిడ్డలు, యువతీ, యువకులు పెద్ద ఎత్తున అమ్మవారి జాతరలో చిందులేశారు. అమ్మవారికి వీరతాళ్లతో నృత్యాలు చేశారు.